క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సాలూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ అప్పలనాయుడు హితవు పలికారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి ఈగల్ క్లబ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే వారి బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న వారిపై ఈగల్ క్లబ్ నిఘా పెడుతుందన్నారు. కార్య క్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బకాయి సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకోండి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సాలూరు: తమకు రావాల్సిన పాత బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణిని మున్సిపల్ కార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆమె స్వగృహంలో మంత్రిని వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చనిపోయిన కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, రక్షణ పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని, మరణించిన కార్మిక కుటుంబానికి ప్రమాద బీమా పథకం కింద రెండు లక్షల రుపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్లు వినిపించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, శంకరరావు, సామయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన పార్వతీపురం విద్యార్థి



బాసూరు వేద హర్ష

పార్వతీపురంటౌన్: జేఈఈ మెయిన్స్‌లో పార్వతీపురం విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన బాసూరు వేద హర్ష 99.90 పర్సంటైల్ సాధించాడు. తండ్రి బి.కిరణ్ కుమార్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా తల్లి లీలాకుమారి ఫార్మసిస్టుగా పనిచేస్తోంది. ఆలిండియాలో 99.90 పర్సంటేజ్ సాధించడంతో పట్టణ వాసులు అభినందించారు.

నెలిపర్తి పాఠశాలలో మెనూ పరిశీలన



విద్యార్థుల మెనూను పరిశీలిస్తున్న డాక్టర్ శివకుమార్

సాలూరు రూరల్: మండలంలోని నెలిపర్తి గ్రామంలో పాఠశాలను మామిడిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్ గురువారం పరిశీలించారు. అలాగే గ్రామంలో ఎఫ్‌డీపీ నిర్వహించి పలువురికి వైద్యసేవలు అందించారు. పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో మెనూను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు శుభ్రత, పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు.

మార్చి 5న శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరామ పాదుకా పట్టాభిషేకం గురించి చర్చిస్తున్న వికాస తరంగిణి అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు

పార్వతీపురం: శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజస్వామి పర్యవేక్షణలో మార్చి 5న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమాన్ని పార్వతీపురంలో నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో విశ్వనాథం, జనార్దన రామానుజ దాసు, గజలక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

దాతలు స్పందించండి



పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు

- పది విద్యార్థుల ప్రత్యేక శిక్షణ
- ఉదయం, సాయింత్రం వేళల్లో అదనపు బోధన
- అల్పాహారం కోసం ఎదురుచూపు

బలిజిపేట: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. పాఠశాలకు ఉదయం 7గంటలకు వచ్చి సాయంత్రం 6గంటలకు ఇంటికి చేరుతున్నారు. ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్, వారాంత పరీక్షలతో బిజీబిజీగా ఉన్నారు. ఉత్తమ ఫలితాల కోసం కష్టపడి చదువుతున్నారు. ఉదయం ఇంటి వద్ద అల్పాహారం, మధ్యాహ్నం పాఠశాలలో భోజనం తీసుకుంటున్నారు. సాయంత్రం స్నాక్స్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. దాతలు స్పందించి అల్పాహారం అందిస్తే వారు ఉత్సాహంతో ఎక్కువ చదివి మంచి ఉత్తీర్ణత సాధించే అవకాశాలుంటాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17నుంచి ప్రారంభం కానున్నాయి. వారికి పునశ్చరణ తరగతులు, ప్రత్యేక బోధనలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు రోజువారీ పరీక్షలు పెడుతున్నారు. సబ్జెక్టుల వారీగా వారికి ఉండే సందేహాలను నివృతి చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివేవారు ఎక్కువ మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారే ఉంటారు. పాఠశాల సమీప గ్రామాల నుంచి ఉదయం 7గంటలకు పాఠశాలకు బయల్దేరి 8గంటల నుంచి ప్రారంభమయ్యే తరగతులకు హాజరవుతున్నారు. మధ్యాహ్నం భోజన పథకంలో భోజనం చేసి సాయింత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు ముగిసిన తరువాత ఇళ్లకు చేరడానికి సమయం పడుతుంది. దీనివల్ల వారు నీరసించి ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం సమయంలో వారికి అల్పాహారం ఏర్పాట్లు ఉంటే విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉండే అవకాశాలున్నాయని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. గతంలో కొందరు దాతలు సహకారం అందించేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితులు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. అక్కడక్కడ పాఠశాల ఉపాధ్యాయులే అప్పుడప్పుడు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారు. గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు, విద్యపై అభిరుచి ఉండేవారు, గ్రామపెద్దలు ముందుకు వచ్చి అల్పాహారాన్ని అందిస్తే బాగుంటుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

దాతలు అందిస్తే మంచిదే



“ పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. ఉదయం వచ్చిన వారు సాయంత్రం అయిన తరువాత ఇంటికి వెళ్తున్నారు. మధ్యలో భోజనం మినహా వారికి ఎటువంటి స్నాక్స్ లేవు. కొందరు పాఠశాల ఉపాధ్యాయులే వాటిని అప్పుడప్పుడు ఏర్పాటు చేస్తున్నారు. అలాకాకుండా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ప్రతిరోజూ స్నాక్స్ అందించే విధంగా ఉంటే చాలా బాగుంటుంది.

– సామల సింహాచలం, ఎంఈఓ-1, బలిజిపేట

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి పూజలు

- దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి



కలెక్టర్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతిస్తున్న అర్చకులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినదీ తీరాన వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోఉన్న లక్ష్మీనృసింహ స్వామివారికి వందలాదిమంది భక్తులు గురువారం అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ముడుపుల పూజలు నిర్వహించారు. ముడుపుల పూజా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక దంపతులు ఇప్పటికే వారంవారం పాల్గొని ముడుపుల ముడుపుల పూజలు చేస్తున్నారు. స్వామి వారిపై భక్తులకున్న నమ్మకంతో వారంతా పూజా సామాగ్రితో ఆలయానికి హాజరై ముడుపుల పూజలు నిర్వహించారు. లక్ష్మీనృసింహ స్వామివారిని దర్శించుకుని ముడుపులుకడితే కోరిన కోర్కెలు సిద్ధిస్తాయన్న నమ్మకంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, సుభిక్షంగా పంటలు పండడానికి వర్షాలు కురవాలని కోరుకున్నామని తెలిపారు.

మార్చి 10 నుంచి అగ్ని గంగమ్మ జాతర



అమ్మవారి ఉత్సవ ఘటాలు

పార్వతీపురం రూరల్: ఆంధ్రా–ఒడిశా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని నీలావడి అగ్ని గంగమ్మ జాతరను మార్చి 10 నుంచి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బడే సత్యంనాయుడు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సభ్యులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ మార్చి 10న అమ్మవారిని ఆలయం నుంచి ఘటంతో గ్రామంలోని మందిరానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలను నిర్వహిస్తామన్నారు. మార్చి 16వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలను, అర్చనలను నిర్వహించి భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 16 నుంచి వేడుకలను నిర్వహించి 19న డప్పు వాయిద్యాలతో అనుపోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

20న పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గ్రామంలో ఈనెల 20వతేదీన కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఎస్సై వెంకటరమణ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వారి, వారి టీమ్ వివరాలను మక్కువ పోలీస్‌స్టేషన్‌లో, మహిళా పోలీసులకు అందించి నమోదుచేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై వెంకటరమణ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు రూరల్: మండలంలోని 11 కేవీ ఫీడర్ జీఎన్‌పేట ఫీడర్ మెయింటనెన్స్‌లో భాగంగా భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కార్యనిర్వహణ ఇంజనీరింగ్ అధికారి కె.గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని చిన్న పారన్నవలస, భవానీపురం, శివరాంపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు,విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘాట్ రోడ్డు అభివృద్ధికి పరిశీలన



ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

సాలూరు: ఎన్‌హెచ్ 26 ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి పి.కోనవలస ఘాట్ రోడ్డు అభివృద్ధికి అధికారులు గురువారం పరిశీలన చేశారు. ఈ మేరకు ఎన్‌హెచ్ సబ్‌డివిజన్ డీఈఈ సత్య భాస్కర్, ఏఈఈ రఘు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్సై సురేష్ తదితరులు సంయుక్తంగా ఘాట్‌రోడ్డును పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.గోపాలం

పార్వతీపురంటౌన్: ఆదివాసీలను నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.గోపాలం డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీల ఊచకోతకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం పార్వతీపురంలోని కలాసీ సంఘం కార్యాయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని విశాల అటవీ ప్రాంతాల్ని, అడవిలోని విలువైన ఖనిజ సంపదను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. మావోయిస్టుల ఏరివేత పేరుతో తీవ్ర నిర్బంధం ప్రయోగించి ఆదివాసీలపై సైనిక బలగాలను ఉపయోగించి ప్రత్యక్ష యుద్ధం సాగిస్తున్నదని విమర్శించారు. తరాలుగా అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణలన్నీ రద్దుచేస్తూ వారి జీవనాన్ని దెబ్బతీస్తూ, వారిని పూర్తిగా అడవుల నుంచి తరిమివేయడానికి సిద్ధమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై సాగిస్తున్న మారణహోమాన్ని ఆపివేయాలని, ఆపరేషన్ కగార్‌ను రద్దుచేయాలనీ వక్తలు డిమాండ్ చేశారు.

సుప్రీంకు విజ్ఞప్తి

సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకుని ఆపరేషన్ కగార్‌ను ఆపివేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఇంతవరకూ జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలపై న్యాయ విచారణ జరపాలని కోరారు. ఆదివాసీల రాజ్యాంగపర రక్షణ, హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బొత్స నర్సింగరావు, సీపీఎం జిల్లా నాయకుడు బీవీ రమణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్, సీపీఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణి, అఖిల భారత ఆదివాసీ వేదిక జాతీయ కమిటీ సభ్యురాలు శంబుడు జయలక్ష్మి, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.లక్ష్మణరావు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పువ్వాల ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

పిసా చట్టంపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: షెడ్యుల్డ్ ఏరియా ప్రజలు పిసా చట్టంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో డీడీ.స్వరూపరాణి కోరారు. ఈ మేరకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం షెడ్యుల్డ్ శంబర పంచాయతీకి చెందిన ప్రజాప్రతినిధులు, మహిళాసంఘాల గ్రూప్ సభ్యులకు పిసా చట్టంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూపరాణి, పరిశీలకులు సుబ్బారావులు పిసా చట్టంపై అవగాహన కల్పించారు. పిసా చట్టం యాక్ట్ 1996 గ్రామీణప్రాంతాల్లో గ్రామసభల ద్వారా స్వయం పాలన నిర్ధారించడానికి పిసా చట్టం రూపొందించినట్లు చెప్పారు. షెడ్యుల్డ్ ప్రాంతాలలో నివాసముంటున్న గిరిజనులకు వారి హక్కులు, జీవనోపాధులు, ఉన్నతికి ఈచట్టం దోహదపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలమమ్మ, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, వార్డుమెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా అభివృద్ధి పనులా?

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గిరిజన సర్పంచులు



మాట్లాడుతున్న గిరిజన సర్పంచులు

పార్వతీపురం రూరల్: పంచాయతీలకు సంబంధించి అభివృద్ధి పనులను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా ఎలా చేపడతారని రావికోన, వెలగవలస, అడారు, పెదమరికి సర్పంచ్‌లు కె. రామస్వామి, ఎం. దాలమ్మ, తోడంగి దిబ్బన్న, ఇ. గంగమ్మ, తదితరులు ఆగ్రహించారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే సర్పంచ్‌లకు సర్వహక్కులు కల్పిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం సర్పంచ్‌లకు కనీస గౌరవం లేకుండా కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌ల తీర్మానం అవసరమైనప్పటికీ తూతూమంత్రంగా సమావేశాలు నిర్వహించి అబివృద్ధి పనులను ఎంపిక చేసి సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే కూటమి ప్రభుత్వ నాయకులు పనులను చేపడుతున్నారన్నారు. సర్పంచ్‌లతో పాటు సిబ్బందిని కూడా భయభ్రాంతులకు గురిచేసి తమగుప్పెట్లో ఉంచుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీ రికార్డుల పరిశీలన పేరుతో సర్పంచ్‌లను వేధిస్తున్నారన్నారు. సర్పంచ్‌ల హక్కులకు భంగం కలిగిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.సంధ్యారాణి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను అతర్హులైన వారంతా మార్చి 6వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీబీఆర్‌ఏజీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీలు 2012 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. బీసీ, ఓసీ, బీసీసీలు 2014 సెప్టెంబరు 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించిన వారై ఉండాలన్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే వారంతా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

గడువులోగా గోశాలలు పూర్తి చేయాలి



గోశాల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో పాడిపశువులున్న రైతులకు మంజూరుచేసిన గోశాలలు నిర్దేశించిన గడువులోగా, నిబంధనలకు లోబడి నిర్మాణం చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని ఆర్. వెంకంపేటలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు, గోశాలల పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ పథకం నిధులతో 80 మంది లబ్ధిదారులకు గోశాలలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు తెలియజేశారు. నిర్దేశించిన గడువులోగా, నిబంధనలకు లోబడి నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లించనున్నట్లు తెలియజేశారు. అలాగే ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతన దారులందరికీ వంద రోజులు పనిదినాలు కల్పించనున్నామన్నారు. అనంతరం రామవరం, కాశీపేట, ఆర్.వెంకంపేట, పెదభోగిలి, బక్కుపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న వేతనదారుల మస్తరును పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయితీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చెత్తనుంచి సంపద తయారీకి సెంటర్లు సిద్ధం



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: గ్రామాల్లో చెత్తనుంచి సంపద తయారు చేయడానికి సర్పంచ్‌ల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఎస్‌డబ్ల్యూపీసీలను సేంద్రియ ఎరువు ఉత్పత్తి చేయడానికి సిద్ధం చేశామని ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని బూర్జలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని ఆయన గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆర్థికాభివృద్ధికి ఎస్‌డబ్ల్యూపీసీలు తోడ్పడతాయని తెలియజేశారు. ఇప్పటికే చెల్లన్నాయుడువలస, పెదభోగిలి, అంటిపేటలలో ఈ సెంటర్లు పని చేస్తున్నాయన్నారు. పెదభోగిలి సెంటర్‌లో ఉత్పత్తి చేస్తున్న సేంద్రియ ఎరువును విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.దాసు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

రీసర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

సీతానగరం: మండలంలో పైలెట్ గ్రామంగా గుర్తించిన లచ్చయ్యపేటలో సర్వే, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న ‘రీ’సర్వే పనులు వేగవంతం చేయాలని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు లచ్చయ్యపేటలో జరుగుతున్న సర్వే పనులను గురువారం ఆయన పరిశీలించి ఇంతవరకూ జరిగిన పనుల రికార్డులను తనిఖీ చేశారు. రీ సర్వే జరుగుతున్న సమయంలో రైతులకు సాంకేతిక పరమైన ఇబ్బందులు లేకుండా రైతుల సహకారంతో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, సర్వేఅండ్ సెటిల్మెంట్ శాఖ నిర్వహించిన గ్రామసభల్లో మ్యుటేషన్స్, వంశపారంపర్యంగా వస్తున్న భూముల వివరాలను రికార్డుల్లో లిఖించాలని, క్రయవిక్రయాలు జరిగిన భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి తమ రికార్డుల్లో పొందుపర్చాలని రైతుల నుంచి వచ్చిన వినతుల పరిష్కారం వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్, మండల సర్వేయర్‌లను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఎస్‌ఏలు పాల్గొన్నారు.

తప్పని జీవనపోరాటం



అలంకరణ సామగ్రిని విక్రయిస్తున్న దాసరి ఎల్లమ్మ

పార్వతీపురం రూరల్:

ఏడు పదుల వయస్సులో కూడా అలుపెరగకుండా తమ జీవనాన్ని కొనసాగించేందుకు ఓ వృద్ధురాలు జీవన పోరాటం సాగిస్తోంది. తనను పోషించి ఆదుకోవాల్సిన కుమారుడు అనారోగ్యంతో కాలం చెల్లడంతో కుటుంబాన్ని పోషించేందుకు అలుపెరగకుండా శ్రమిస్తోంది. మండలంలోని పెదబొండపల్లి గ్రామానికి చెందిన దాసరి ఎల్లమ్మ తన మనుమడిని, కుటుంబాన్ని పోషించేందుకు గ్రామాల్లో తిరిగి మహిళల అలంకరణకు సంబంధించిన వివిధ వస్తువులను విక్రయించి కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. యవ్వనంలో ఉన్నవారే కష్టించేందుకు ఇష్టపడని ఈ రోజుల్లో ఏడుపదుల వయస్సు దాటిన ఈ వృద్ధురాలు కష్టిస్తున్న తీరును పలువురు స్థానికులు మెచ్చుకుంటున్నారు.

వల్లభనేని వంశీ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

- మాజీ ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన తన స్వగృహం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని హైదరాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేసిన తీరును ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగం అపహాస్యం అవుతోందని, చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలను అపహాస్యం చేస్తోందన్నారు. బహుశా ఇంతటి అరాచకం ఎక్కడా చూసి ఉండమని, కక్ష రాజకీయాల్లో గన్నవరం కేసుది మరో రాక్షస అధ్యాయంగా చెప్పుకోవచ్చన్నారు.

వాహనాలకు ఇన్సూరెన్స్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ ఎం.శశికుమార్

పార్వతీపురం టౌన్: వాహనాలకు ఇన్సురెన్స్ చేయాలని ఎంవీఐ ఎం.శశికుమార్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహన షోరూం డీలర్స్, ఇన్సూరెన్స్ సర్వేయర్స్, వివిధ వాహనాల యూనియన్స్‌తో వాహనాలకు ఇన్సూరెన్స్ ఆవశ్యకత, రోడ్ ప్రమాదాలు జరిగినపుడు దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాహన్ సాఫ్ట్‌వేర్‌తో ఇన్సూరెన్స్ డేటా దేశంలో ఎక్కడినుంచైనా వీక్షించవచ్చని, దీనివల్ల సత్వరం బాధితులకు క్లెయిమ్ వస్తుందని వివరించారు. వాహన షోరూం డీలర్స్‌కు వాహన కొనుగోలు దారులకు రహదారి నిబంధనలు పాటించపోవడం వల్ల కలిగే దుష్ఫలితాలు/అనర్థాలను వివరించారు. హిట్ అండ్ రన్ అక్సిడెంట్ కేసులలో మరణించిన వారికి రూ.2లక్షల వరకు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేల వరకు ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు. ప్రమాదం జరిగిన 48 గంటల్లో సంబంధిత అన్ని శాఖలు ఐ-ఆర్‌ఏడీలో అప్‌లోడ్ చేయడం వల్ల ఇన్సూరెన్స్ బాధితులకు తొందరగా చేకూరుతుందని ఆయన చెప్పారు. వాహన తనిఖీల్లో ఇన్సూరెన్స్ లేకుండా పట్టుబడితే రూ. 2వేల వరకు అపరాధ రుసుము విధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.సీతారాం, మెడికల్ ఆఫీసర్ డా.పి.నారాయణరావు, రవాణాశాఖ సిబ్బంది, వాహన షోరూం డీలర్స్, ఇన్సూరెన్స్ సర్వేయర్స్, వివిధ వాహనాల యూనియన్స్ సభ్యులు హాజరయ్యారు.